# బామ్మో! కాశీలో వదిలెయ్యి

మా వారు కాశీ ప్రయాణానికి టిక్కెట్లు తెచ్చారు.

మా అత్తగారి చిరకాల వాంఛ కాశీ ప్రయాణం. బంధువులు రమ్మన్నప్పుడు గానీ, కొడుకు 'తీసుకెళతా నమ్మా!' అన్నప్పుడు గానీ వెళ్ళుంటే, ఆవిడ కోరిక ఎప్పుడో తీరేది. కానీ వెళితే కదా! మా అత్తగారికి తాపత్రయం ఎక్కువ.

"మా కాలంలో కళ్ళు మునుకుని కని పారేస్తే, గుడ్డిదైనా పెంచేది పిల్లల్ని. నీ పిల్లలు అలా కాదే తల్లీ! నేను, వాడు లేకపోతే చెండుకు తినేస్తారు నిన్ను. పిల్లలు కారే వీళ్ళు - చిచ్చర పిడుగులు." అంటూ నా మీద అభిమానంతో తన కత్యంత ప్రియమైన కాశీయాత్రని వాయిదా వేసుకుంటూ వచ్చారు.

మా అత్తగారి అత్తగారి గురించి అడిగినప్పుడు - "ఆవిడ మహా దొడ్డ ఇల్లాలనీ, ఊరందరికీ సహాయపడేదనీ, ఇప్పటి పరిభాషలో అయితే సంఘసేవకురాలనీ, ప్రతి మంచి పనికి చేతికి ఎముక లేకుండా దానాలు చేసేదని అదే దొనేషన్లు ఇచ్చేదని, దొంగాడు రాగి దేకిశా పట్టుకెళుత్తున్నా చూస్తూ ఊర్కుని, మడిబట్ట తాకగానే చ్రేపాటి కర్రతో చావబాదిన వీర వనిత." ఇలాగే ఆవిడ గురించి చాలా విషయాలు మా అత్తగారు చెప్పడం వల్ల పేరు కో చరిత్ర, మాట కో సామెత సంప్రదాయాన్ని ప్రవేశపెట్టింది మా అత్తగారేనని, అందులో పూర్వీకుల జోక్యం ససేమిరా లేదని మా పిల్లలు తీర్మానించారు.

మా అత్తగారు పాత - కొత్తల మేలు కలయిక. పురాతన సంప్రదాయాలని వదులుకోలేక, ఆధునిక సంప్రదాయాలని ఆచరించలేక సందిగ్ధంలో పడి ఆవిడతోపాటు మమ్మల్నీ తికమక పెట్టి హైరాన పడిపోతారు.

డిగ్రీ ముక్క రాగానే పుస్తకాలు కట్టకట్టి అటక మీద కెక్కించి, చేతిలో ఉన్న డిగ్రీయే తమ చదువుకు నిదర్శనం అని మురిసిపోయే రోజుల్లో, అక్షర జ్ఞానం అలవడిన దగ్గరనుండి వల్లె వేసిన పురాణాలని ఈ నాటికీ వదలకుండా చదువుతున్నా రనడానికి నిదర్శనం సుందరకాండ, భగవద్గీత నిత్య పారాయణం. అప్పుడప్పుడు మిగిలిన పుస్తకాలని అవలోకించడం వెరశి పూజ గదిలోని అలమారు నిండిన పురాణేతిహాసాలు అట కెక్కడానికి నిరాకరించి పూజగదిలో తమస్థానాన్ని స్థిరపరచుకున్నాయి.

మా అత్తగారికి శ్రావ్యమైన కంఠస్వరం, సంగీతజ్ఞానం కూడా ఉన్నాయి. తెల్లవారుజామునే లేచి ముక్కోటి దేవతల స్తోత్రాలు ఖంగుమని రాగయుక్తంగా పాడుతుంటే మైకు లేకుండా మూడు వీధులకి వినిపిస్తుంది. అద్దెకు దిగిన వాళ్ళు మా ఇంట్లో ఉన్న సదుపాయాలకి మురిసిపోయి, అద్దె బేర మాడకుండా ఆ క్షణాన్నే దిగిపోయి, కొత్తల్లో అత్తగారి కంఠ మాధుర్యానికి ముగ్ధులైనా, మూడు నెలలు తిరిగేసరికి ఖాళీ చేస్తుంటే, అమాయకంగా - "అ దేవిటే వద్దాలూ! నువ్వా? నోట్లో వేలు పెట్టినా కొరకలేని అమాయకురాలివి. ఒకరి జోలి, శొంఠీ అక్కరలేదు. నేనా ఆ ఛాయలకే వెళ్ళను. గోలా, గొడవ పెడితే ఖాళీ చెయ్యాలిగానీ, నిక్షేపంలాంటి మ నిల్లెందుకు ఖాళీ చేస్తారే" అని అడుగుతుంటే వెర్రి ముఖం వేసుకుని "ఏమో అత్తయ్యా!" అనడం తప్ప ఏం చేయను చెప్పండి.

పిల్లలు మాత్రం - "రేడియో, టి.వీ. ఫుల్ వాల్యూమ్ పెట్టినా బామ్మ వాయిస్‌కి బాక్‌గ్రౌండు మ్యూజిక్‌లా ఉంటుందే కానీ అక్షరం అర్థమవదు" అంటారు.

"బామ్మా! నీ లౌడ్ స్పీకర్ వాయిస్‌కి అదిరిపడి చదువులు సాగక ఇల్లు ఖాళీ చేస్తున్నారు" అని చిన్నాడు ముఖాన అంటుంటే, చిరు నవ్వులు నవ్వుతూ - "చాతకాని సన్నాసులు చదూకోడం రాక నెపం నా మీద వేస్తున్నారుగానీ, మీరు మాత్రం చదూకోడంలా!"

"అవును బామ్మా! వాళ్ళు పుట్టిన దగ్గరనుండీ మనింట్లోనే ఉంటే అలవాటై ఉండేది. పాపం ఎక్కడో పుట్టి పెరిగి వస్తున్నారుగా అందుకనే అలవాటు పడలేకపోతున్నారు." ఖాళీ చేసిన వాళ్ళకి సానుభూతి చూపిస్తారు పిల్లలు.

ప్రతి మనిషికి ఓ ఆదర్శం ఉంటుంది. మా అత్తగారికి ఉద్దాలక చరిత్రలోని చండిక పాత్ర ఆకర్షించినంతగా తను చదివిన పురాణాల్లో మరో పాత్ర ఆకర్షించ లే దనడానికి నిదర్శనం ఆవిడలో చండిక పాత్ర జీవం పోసుకుంది. మన పని సానుకూల పడాలంటే ముందు మనం వ్యతిరేకం చెప్పాలన్నమాట. ఉదాహరణకి - "పూజలూ అవీ నియమంగా, నిష్ఠగా చెయ్యకపోతే ఎలా గత్తయ్యా!" అన్నా ననుకోండి. "అయ్యో! అ దేం అక్కరలేదే అమ్మా! మనసు ముఖ్యం" అంటారు. అదే మనం "మనసు ముఖ్యం పూజల దేముంది" అన్నా మనుకోండి. "అయ్యో! పిదపకాలం, విపరీత బుద్ధులూ కాకపోతే మన సంప్రదాయాలని మట్టిలో కలిపేస్తారా! మన పూర్వులు వెర్రి వెధవలై పెట్టారా ఇవన్నీ" అంటూ సోదాహరణంగా వివరించి మన కాలహరణం చేసేస్తారు.

ఇటువంటి వంటి మనిషి కాశీయాత్ర వెళ్ళే అవకాశం ఉండీ, ఎందుకని వెళ్ళలేకపోయింది అని ఎవరికైనా సందేహం రావచ్చు.

వచ్చిన బంధువులందరి దగ్గిరా - "మా కాలంలో ప్రయాణ సౌకర్యాలు లేని రోజుల్లోనే మా అత్త, మామ కాశీ యాత్ర చేశారు. మా వారు బతికున్నంత కాలం కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం అంటూ గడిపేశారేగానీ, పిచ్చి మొద్దు దీన్ని కాశీ తీసికెళ్ళాం, సరిగంగ స్నానాలు చేద్దాం అని అనుకోనన్నా అనుకోలేదు.

"ఈ రోజుల్లో అన్ని సౌకర్యాలు ఉండి వెళ్ళలేకపోతున్నాను." అని వాపోయినప్పుడల్లా మా వారు - "రావే అమ్మా! నిన్ను నే తీసుకెళ్తాను" అని బయలుదేరమంటే అందరం కలసి వెళ్ళాలని పట్టుపట్టుకు కూర్చున్నారు.


మొగుడితో పెళ్ళికి, పిల్లలతో యాత్రకి వెళ్ళగూడదన్న సామెత నా పట్ల వర్తించి, పిల్లలు చిన్నవాళ్ళు కావడంతో నేను బయలుదేరలేదు. ఇదుగో ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్ళయ్యారని ప్రయాణం.

పేరు కో చరిత్ర ఉం దన్నాను కదూ! మిమ్మల్ని విసిగించకుండా సంక్షిప్తంగా చెప్పేస్తాను.

మా మామగారి పేరు ఆంజనేయులు. మనవడో, మనవరాలో పుడతా రని అనుమానించిన క్షణంలోనే మా మావగారి పేరు పెట్టాలని తీర్మానించారు అత్తగారు. మావారికి బొత్తిగా ఆంజనేయులు అని పెట్టడం ఇష్టం లేదు. కొడుకు నామకరణం రోజున తల్లి పక్కన చేరి - "అమ్మా! నాన్నగారి పేరు పెడదాం కానీ, వాడు అల్లరి చేసినప్పుడల్లా నీ కోడలు తిట్టిం దనుకో నాకు బాధగా ఉంటుందే. అయినా నీ కోడలు పేరు పెట్టి పిలుస్తుంటే నీకు మాత్రం బాగుంటుందా! అందుకని పవన్‌కుమార్ అని పెడదాం. ఎంచక్కా పవన్ అని పిల్చుకోవచ్చు." ముద్దులు గుణుస్తూ చెబుతున్న కొడుకు మీద ప్రేమ అమితంగా ఉప్పొంగి పొరలి - "అలాగేలేరా! పవన్‌కుమార్ అంటే మాత్రం ఆంజనేయులు కాదూ!" దీర్ఘం తీస్తూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు.

రెండవసారి మనవడు పుట్టినప్పుడు - "వద్దాలూ! మీ నాన్నపేరు పెట్టవే!" అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, అంతలోనే - "అన్నట్టు నీకు

టి.వి. కళ్యాణి



నలతగా ఉన్నప్పుడు సుబ్రహ్మణ్యేశ్వరుని పేరు పెడతానని మొక్కాను సుమా! ఆ పేరు కలవండి" అని హెచ్చరించారు. ఈ సారి మా వారేం చేయాలో తెలియక కిందా, మీదా పడి బుర్ర బద్దలయ్యేలా ఆలోచించి, సంశయంగానే "అమ్మా! శివకుమార్ అని పెడదామా!" మాట పూర్తి కాకుండానే అంతెత్తున ఎగిరి - "ససేమిరా వీల్లేదు. శివకుమారంటే గణపతా? సుబ్రహ్మణ్యేశ్వరుడా? నీ తెలివి తెల్లారినట్లే ఉంది. మొక్కుకుంటే పేరు స్పష్టంగా ఉండాలి అంతే! అయినా పట్టూ, విడుపూ ఉండాలిగానీ, తా పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటే ఎలా?"

వా ళ్ళిద్దరి వాదన ఎంతకీ తెగదు. పిల్లాడు గుక్కపట్టి ఏడుపు.

మా ఇంటి పురోహితుడు మామగారి కాలం నుంచే వస్తున్న పండు ముదుసలి. మా ఇంట బాగా చనువున్నవారు, అజమాయిషీ చేయగలిగినవారూ కావడంతో "అబ్బాయీ! ఇలా రా!" ఒక్క అరుపు అరిచి, "నే చెప్పినట్లు రాయి" అంటూ పసుపుకొమ్ము చేతికిచ్చి "శివకుమార సుబ్రహ్మణ్య గణపతి" అని రాయించి, "ఇక నీ ఇష్టం వచ్చినట్లు పిల్చుకో పో!" అంటూ ఇద్దరి వాదనకి ఫుల్‌స్టాప్ పెట్టారు.

ఆ తతంగం అంతా అయ్యాక "ఆంజనేయుడికి అన్నదమ్ములు లేకపోవడం మన అదృష్టం. లేకుంటే వాడికి కూడా కొల్లేటి చాంతాడంత పేరయ్యేది. అమ్మ చాదస్తం మరీను" అని విసుక్కుంటున్న మా వారిని చూసి జాలి పడి - "బియ్యంలో రాయడానికేగానీ ఆ పేరంతా పిలుస్తామా ఏమన్నానా! అయినా అంత పూర్తి పేరు పెట్టి పిలిచే వా రెవరు? 'శివా' అని పిలవండి చాలు!" అని ఓదార్చాను.

ఆ తరువాతది అమ్మాయి. దాంతో మరి పిల్లలు పుట్టకుండానే ఆపేశామని తెలిసి మా అత్తగారి అంతర్మథనం ముఖంలో ప్రతిఫలిస్తుంటే -

"ఎలాగే వర్ధాలూ! మరో కూతుర్నన్నా కనడానికి ఒప్పుకోకపోతివి. నా పేరా, మీ అమ్మపేరా నిర్ధారించుకోలేక అతలాకుతలం అయిపోతున్నాను. పోనీ మీ అమ్మపేరు పెట్టుకోమంటే మరి నా పే రెవరికి పెట్టను?" పరివరి విధాల తన బాధని నా ముందు వెళ్ళబోసినా చిరునవ్వు నవ్వుతుంటే, "నవ్వవే వర్ధాలూ! బాగా నవ్వు! అందుకే అన్నారు పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం."

ఇక మరి ఎటూ నిర్ధారించుకోలేక "ఒరేయ్ శానాయి!" అంటూ కొడుకుని పిలిచి తన బాధని వెళ్ళబోసుకుంటే, అప్పుడు ఆయన తల్లిని ఊరడించి, అమ్మా నీ పేరు స్వరాజ్యం, అత్తగారి పేరు అపర్ణ, అందువల్ల నీ పేరు మొదటి అక్షరం, అత్తగారి పేరులోని ఆఖరి అక్షరం కలిపి స్వర్ణ అని పెడదాం. అదీ నీ కిష్టమైతేనే సుమా!" అన్నారు.

ఓహ్! ఇంకేం! అడిగిన వాళ్ళకి, అడగని వాళ్ళకీ తన కొడుకు కాబట్టే ఇంత తెలివిగా వియ్యపురా ళ్ళిద్దరి పేర్లూ కలిపి పెట్టాడని సంబరంగా చెప్పుకోవడమే పని.

అయ్యో నీ పిల్లలు కదా పేర్లు పెట్టుకోవడంలో నీకు మాత్రం ఆసక్తి లేదా అని మీకు సందేహం రావచ్చును. ఎందుకు చెప్పండి అత్తగారిని బాధపెట్టడం. ఎలాగూ ఎంత మంచిపేరైనా ఆవిడ పిలుపులో రూపాంతరం చెంది బంధువులందరిలో అవే పేర్లు చెలామణీ అవుతాయి. అలాంటప్పుడు ఏ పేరైతే నేం? ముందు ముందు మీకే అర్థమవుతుంది నే నెంత నిజం చెబుతున్నానో!

ఇక ప్రయాణం సంగతి చూద్దాం!

ప్రయాణం అని తెలిసిన దగ్గరనుంచి ఇల్లంతా బొంగరంలా తిరిగేస్తున్నారు అత్తగారు. ఏం చేయాలో తోచడం లేనట్లుంది.

"బామ్మా!" పిలుపుతోపాటు పరుగున వచ్చిన పెద్ద మనవడిని చూసి - "రారా వన్నిగా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను." సంబరంగా ముఖం చేటంత చేసుకుని "మీ నాన్న టిక్కెట్లు తెచ్చాడురా! నువ్వు గబగబా వచ్చి అటక మీద ట్రంకుపెట్టె దించిపెట్టాలి తొందరగా రా!"

"వన్ మినిట్! వస్తున్నా."

పుస్తకాల నంచి గిరాటువేసి, అటకమీద ఎక్కితే స్కూల్ డ్రస్సు ఎందుకూ పనికిరాదని అనుభవం వల్ల గ్రహించినవాడై పాత పైజామా ధరించి మరీ వచ్చాడు.

పెరట్లోంచి నిచ్చెన సాయంపట్టి తెచ్చారు. అటకకి ఆనించి నుంచోబెట్టి - "బామ్మా! కదలకుండా పట్టుకో!" హుకుం జారీ చేసి, రెండు మెట్లెక్కి సందేహం వచ్చి "బామ్మా! ట్రంకు పెట్టె ఇప్పు డెందుకే?"

"అడిగావూ! చెప్పదంటు ప్రశ్న అయినా రామాయణం అంతా విని, రాముడికి సీత ఏమవుతుంది అన్నాట్ట వెనకటికి నీలాటివాడే!"

"నే నిప్పుడే కదా ఇంట్లో అడుగుపెట్టింది. అప్పుడే రామాయణం ఎక్కడ చెప్పావబ్బా!"

"నీ ఆశ్చర్యం దొంగలు తోలా, కాశీ వెళుతున్నాం అని చెప్పా గదరా పిచ్చి సన్నాసీ!"

"కాశీకీ ట్రంకుపెట్టెకీ ఏమిటీ సంబంధం?" నిలదీసి అడుగుతున్నాడు పవన్.

ముద్దుగా విసుక్కుంటూ - "ముందు దించు చెబుతానుగానీ!"

"ముందు చెప్పు బామ్మా!" గారాలుపోతూ మనవడు.

"జీళ్ళపాకంలా పట్టుకుంటే వదలవు. మా నాన్న గదూ! బంగారుకొండ కదూ! దించమ్మా!" గడ్డం పుచ్చుకుని బతిమాలుతూ అంది బామ్మ.

"నువ్వు చెప్పాల్సిందే!" పట్టుదలగా అన్నాడు పవన్.

"సరే అయితే. ఆ ట్రంకుపెట్టె నేను కాపరానికి వచ్చినప్పుడు మా పుట్టింటి వారు ఇచ్చింది." తాపీగా చతికిలబడి మొదలుపెట్టగానే -

"బామ్మా! బాబోయి మరివద్దు. నీ పెట్టె దించుతాను. నిచ్చెన గట్టిగా పట్టుకో."

కంగారుగా ఎక్కుతుంటే - "ఒరే! పన్నిగా! నిదానం ప్రధానంరా!"

బామ్మ అరుపుకి "ఆలస్యం అమృతం విషం" అంటావుగా అటకమీద నుంచి బదు లిచ్చాడు మనవడు.

బామ్మ పుట్టింటి, అత్తింటి చరిత్రలన్నీ మనవలకి క్లాసు పాఠాలకంటే క్షుణ్ణంగా కంఠత వచ్చు. అందుకే చరిత్ర తిరగతోడితే భయపడుతుంటారు.

అటక మీద కెక్కించి ఎన్ని సంవత్సరాలైందో! పెట్టె కదపగానే దాని మీద దుమ్ము-ధూళీ చెదిరి పవన్ తుమ్మసాగాడు.

"పద్దాలూ! పద్దాలూ!" అత్తగారి గావుకేకలు.

పరుగున వెళ్ళా నక్కడికి - "ఏమి టంటూ?"

"శుభమా అని పెట్టె దించమంటే తుమ్ముతున్నాడే నీ కొడుకు. దించితే మంచిదే నంటావా?" అమాయకంగా ముఖం పెట్టి అడుగుతుంటే జాలేసి - "పరవాలే దత్తయ్యా! ఒక తుమ్ము తుమ్మితే దోషంగానీ, వందలు తుమ్మితే తప్పు లేదు" అన్నాను.

"అవును కదూ! నా మతి మండా! ఆ పాటి తెలివి నీకు లేకపోయిందే! వెళ్ళమ్మా నీ పని చూసుకో!"

"బ్రతుకు జీవుడా!" అని అక్కడి నుండి కదిలాను.

ఆపసోపాలు, అష్ట కష్టాలు షడి ట్రంకు పెట్టెని కిందికి దించి, బామ్మ, మనవడు కలిసి పెరట్లోకి తీసుకువెళ్ళి వంతులవారీగా తుమ్ముకుంటూ పెట్టెనంతా శుభ్రం చేశారు. అక్కడక్కడా పట్టిన తుప్పు బామ్మ కళ్ళల్లో నీరు తెప్పిస్తే, ఆప్యాయంగా మనవడు చేతులతో తుడిచి ఓదారుస్తున్నాడు.

బామ్మ నిలబడుతూ - "పన్నిగా! రోజూ బ్రష్‌లు పట్టుకు తిరుగుతావు కదరా రంగులు పులుముతానని, బాబ్బాబూ! ఈ పెట్టెకి రంగేసి పెడుదూ! చచ్చి నీ కడుపున పుడతా!"

హీరోలా పోజు పెట్టి - "అయితే పెట్టెని పడుకోపెట్టి రెడీగా ఉంచు బామ్మా! రంగులు తెస్తా" అని తుర్రుమన్నాడు రంగుల కోసం.

పవన్‌కి ఆర్టిస్ట్ అయిపోవాలని పిచ్చి. బ్రష్‌లు, రంగులు పట్టుకుని కనపడ్డ కాగితం మీదల్లా రంగులు పులుముతుంటే, మనవలకి రాని విద్యంటూ లేదని, తన మనవ లంత తెలివైన వాళ్ళు ప్రపంచంలోనే లేరని మా అత్తగారికి గర్వం.

అత్తగారు ఆప్యాయంగా పెట్టె నిమురుతూ పాత జ్ఞాపకాలలో మునిగి తేలుతుంటే, పవన్ కిటికీలకి, తలుపులకి వేయగా మిగిలిన రంగుల్ని తీసుకుని పెరట్లోకి తయారయ్యాడు.

పెయింట్ కలపడం సాంపు పెరడంత ఖరాబు చేసి మరకలు మరకలుగా పెట్టంత రంగు పూసి, రెండో కోటింగ్ వేస్తేగానీ షైనింగ్ రాదని తనకున్న పరిజ్ఞానంతో బామ్మని మెప్పించి, పెట్టెని గాలికి ఆరబెట్టి లోపలికి వచ్చా రిద్దరూ.

ఈలోగా స్వర్ణ, శివ రావడంతో పిల్లలు ముగ్గురూ ఫలహారాలు సేవించి, మళ్ళీ ముందు గదిలో చేరి బామ్మతో ప్రయాణం గురించి ముచ్చటించుకుంటున్నారు పట్టుకువెళ్ళే సామాన్ల గురించి చర్చిస్తూ. ఇంతలో కాశీలో వదిలేయవలసిన వాటి మీద మళ్ళింది సంభాషణ.

"బామ్మా! నువ్వేమిటి వదిలేస్తావు?" స్వర్ణ సందేహం.

"అదే ఆలోచిస్తున్నానే నన్నాలూ! నాకు ఇష్టమైనవి చాలానే ఉన్నాయి మరి."

"బామ్మా! తినేవే వదిలేయాలా?" శివ సందేహం.

"ఔనురా శివ్విగా! తినేవే వదిలేయాలి. అందులోనూ అన్నింటికంటే ఇష్టమైనవి వదిలేయాలి." ఒక్క క్షణం ఆగి "పోనీ, మీరు చెప్పరాదూ - నా కేవేవి ఇష్టమో బాగా తెలుసు కదర్రా మీకు." ఆప్యాయంగా మనవల వైపు చూస్తూ అడిగారు.

"బామ్మా! కాశీలో ఏది వదిలేసినా పరవాలేదు. నా మాట విని సామెతలు, పిండి వంటలు చేయడం కాశీలో వదిలేయ" తన అభిప్రాయం వెలిబుచ్చాడు పవన్.


మిగిలిన ఇద్దరూ తందాన తాన అన్నారు.

"భడవల్లారా! నన్ను చూస్తే ఆటగా ఉందా!"

"కాదు బామ్మా! నిజంగానే! నీ సామెతలు విని వినీ చచ్చిపోతున్నాం. ఎవరితో మాట్లాడినా మా నోటంట సామెతలే వస్తున్నాయి. నువ్వు చేసిన పిండివంటలు తింటే మా పళ్ళు కదిలిపోతున్నాయి. ఈ సారి ఊడితే మరి రావు బామ్మా!" శివ దీనంగా విన్నవిస్తుంటే పవన్, స్వర్ణ - "నిజం బామ్మా! శివ మాటలు ముమ్మాటికీ నిజం. అందుకే కాశీలో పిండి వంటలు చేయడం, సామెతలు మాట్లాడటం వదిలేయి. ప్లీజ్ బామ్మా! మా మంచి బామ్మవి కదూ!" బామ్మ మీద పడిపోయి గడ్డం, కాళ్ళూ, చేతులూ పట్టుకుని ముగ్గురూ బతిమాలసాగారు.

వాళ్ళని వదిలించుకుని, "బాగుంది మీ వరస! 'పిచ్చి కుదిరింది రోకలి తలకి చుట్టమన్నాట్ట' వెనుకటికి మీలాంటివాడే. తినే వస్తువులు కాశీలో వదలాలని చెబుతుంటే వినరేం."

"అలా అని రూలేం లేదు బామ్మా! ఈ మధ్య మా ఫ్రెం డొకడు కాశీ వెళ్ళి తన కత్యంత ప్రియమైన 'అమితబచ్చన్ సినిమాలు' మరి



చూడ నని వదిలేశాడట!" శివ సమర్థింపు.

"అయ్యో! అయ్యో! సినిమాలూ, గట్రా వదిలేస్తార్రా! సోద్యం గాకపోతే!" అని బోల్డంత ఆశ్చర్యపడిపోయి, "ఎవరి వెర్రి వాళ్ళ కానందం" అంది.

"కాదు బామ్మా! నక్క పుట్టి నాలుగు వారాలు కాలేదు ఇంత పెద్ద గాలివాన ఎరగనంది!" శివ వెక్కిరింపు.

"ఛత్! భడవకానా! గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిం దట!"

"బామ్మా! నువ్వుండు! ఏరా శివా! నోరుముయ్యి. గాడ్దు కేం తెలుసు అటుకుల రుచి అని బామ్మ పిండి వంటల్లో మజా నీ కేం తెలుసు?" పవన్ గద్దింపు.

"గురివింద గింజ తన నలు పెరగదని, నువ్వెన్నిసార్లు బామ్మని వెటకారం చేయలేదూ?" శివ రెట్టించాడు.

"కాట్ల కుక్కల్లా పోట్లాడుకోడమేనా మీ పని. వచ్చిన దగ్గర నుంచీ ఇదే వరస" స్వర్ణ సాధింపు.

"నోర్మూయ్యవే! నే నసలు మీతో కాశీ రాను." పవన్ పెద్దరికం వీగిపోయిందని కోపం.

"మానెయ్! హాయి! నీ కోడీ, కుంపటీ లేకుంటే తెల్లారదా! నువ్వు రానంత మాత్రాన మా ప్రయాణం ఆగిపోదు." శివ విసురు.

"వాడి డాబులన్నీ మన ముందే. నాన్నగారు వచ్చి ఏరా? అంటే చాలు చచ్చినట్లు వస్తాడు. ఎన్నాళ్ళయి అంటే ఆర్నెళ్ళయి అంటూ." తేలిగ్గా అంది స్వర్ణ.

మనవల మాటలు వింటున్న బామ్మగారి మతి పోతోంది. 'ఆ చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందట' తన సామెతల ప్రభావం మనవల మీద బాగా పనిచేస్తోందే - అని మనసులో అనుకుంది.

"భడవకానల్లారా! నోరు ముయ్యండి!"

"బామ్మా! మరి నువ్వు సామెతలు వదిలేస్తావా?" ముగ్గురు ఒకేసారి కోరస్‌గా అడిగారు.

"పుర్రెకు పుట్టిన బుద్ధి పుడకలతోగానీ పోదని, బాబ్బాబు! నా మానాన నన్ను వదిలేయండి. మీరు మాత్రం సామెతలు మాట్లాడకండి" అని బతిమాలుతుంటే -

"ఎలా బామ్మా! తెల్లవారిదగ్గర నుంచి తుమ్మల్లో పొద్దు గుంకేదాకా నువ్వు మాతో మాట్లాడేది సామెతలేగా! అయినా బామ్మా! నీ కీ సామెతలు ఎవరు నేర్పారు? తాతగారేనా!" స్వర్ణ సందేహం.

"బాగుంది. మీ తాతగారికి అంత తీరిక కూడానా! దరిద్రుడి తల కడిగితే వడగళ్ళవానట. ఆయన ఎప్పుడైనా కర్మకాలి ఇంటిపట్టున ఉంటే, ఆ రోజు మందలా వచ్చిపడేవారు చుట్టాలు."

"బామ్మా! పొరుగింటి అట్లకి నెయ్యి ఎప్పుడు కాచుకునేదానివి?"

శివాన్ని గద్దిస్తూ - "పెద్దంతరం చిన్నంతరం లేకుండా ఏమిటా మాటలు?"

మా అత్తగారి నోటి నిండా సామెతలే. పిల్లలు ఆవిడ అలుసు కనిపెట్టి ఆమె సామెతలతోనే ఆమెకి జవాబులు చెబుతుంటారు. ఒక్క క్షణం బామ్మా మనవలకి పడదు. కానీ వదిలి ఒక్క రోజన్నా ఉండలేరు. భిన్నత్వంలో ఏకత్వం అంటే ఇదేనేమో అనిపిస్తుంది నాకు.

సామెతలు ఎందుకు వదలాలో ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది మీకు. రెండో అంశం పిండి వంటలు. ఈ మధ్య జరిగినవి మాత్రం చెబుతాను. పాత చరిత్ర అంత చెప్పుకొస్తే కనీసం పాతిక పర్వాలైనా రాయాలి. మహాభారతాన్ని మించి పిండివంటల చరిత్ర గిన్నిస్ బుక్‌లోకి వెళ్ళిపోతుంది. అయినా ఈ రోజుల్లో అంతంత చరిత్రలు చదివే సమయం ఎవరికుంది కనుక!


పిల్లలు ఏదన్నా స్వీటు చేయవే అని గోలపెడుతుంటే, తలచుకున్నప్పుడే తాతకి పెళ్ళి అంటే ఎలా కుదర్తో - అలాగే మా ఇంట పిండివంటలు చేయడానికి కొన్ని సమయాలున్నాయి. అత్తగారు గుళ్ళో పురాణం వినడానికి వెళ్ళినప్పుడో, లేదా సాయంత్రం దేవుని దగ్గర భక్తిపారవశ్యంతో భజన గీతాలు పాడుతున్నప్పుడో చేయాలి. లేకపోతే చెప్పాను కదా మా అత్తగారికి నే నంటే వెర్రి ఆపేక్ష. అందుకని తనే చేస్తా నంటూ తయారవుతారు.

ఒక రోజు అలవాటు ప్రకారం అత్తగారు భజన గీతాలు ఆలపిస్తున్న సమయంలో మైసూర్‌పాక్ చేద్దా మని అన్నీ సిద్ధం చేసుకుని, స్టాండులోంచి గరిట తీస్తుంటే ఠంగ్ మని కింద పడింది. ఆ శబ్దం మా అత్తగారి కర్ణపుటాలకు సోకి హుటాహుటిన వంటగది ప్రవేశం చేసి అక్కడ సిద్ధంగా ఉన్న సరంజామాని చూసి - "మైసూర్‌పాక్ చేద్దామనా?" అని, "ఇలా తే గరిట. రెండు నిముషాల్లో తిప్పి పడేస్తాను" అంటూ చేయడానికి ఉపక్రమించగానే, మూలనున్న పీట వాల్చుకుని ఉసూరుమంటూ కూలబడ్డాను.

పిల్లలు ఆటల నుండి రాగానే - "రండర్రా పిల్లలూ! మైసూర్‌పాక్ తిందురుగాని" అంటూ పళ్ళెం పుచ్చుకుని వాళ్ళ ముందుకు వెళ్ళారు. శివ, పవన్, ఇద్దరూ కుస్తీపట్టి దాన్ని పళ్ళెం నుండి విడదీయలేకపోయారు. ఇదికాదు పని అని శివ పరుగున వెళ్ళి పక్కవాళ్ళని అడిగి సుత్తి తెచ్చాడు. కత్తి సాయంతో ముక్కలు కొట్టారు. అతి తొందర పిల్ల స్వర్ణ గబుక్కున ఒక ముక్క తీసుకుని కొరికింది. ముక్క కొరకబడలేదుగానీ, స్వర్ణ పన్ను ఊడింది. పళ్ళు ఊడే వయసని వాళ్ళ బామ్మ సమర్థిస్తారుగానీ, మైసూర్ పాక్ వల్లే పన్నూడిందని శివ, పవన్‌ల ఏకాభిప్రాయం. కొద్దిగా గట్టిపడిందని బామ్మ బాధపడుతుందని పిల్లలూ బోల్డంత బాధపడి, బామ్మ బాధ చూడలేక పళ్ళ జాగ్రత్త కోసమని మెత్తగా ఉండ చేసి తియ్యగా ఉన్నదని తిన్నారనుకోండి! అది వేరే విషయం!

అలాగే ఒకసారి మాకు తెలిసిన వాళ్ళు మురిపీలు పంపించారు. అది రాజులు తరచుగా చేసే పిండివంట. గోధుమపిండి గట్టిగా కలిపి బొటనవేలితో గుమ్మడి చెక్కల్లా నగిషీలు చెక్కి, చెవి ఆకారంలో చేసి, వేయించి పాకం పట్టాలి. పిల్లలు వాటిని చూసి, తెగ సంబరపోతుంటే - "అయ్యో! అ దెంతసేపే పద్దాలూ! ఆ గోధుమ పిండి ఇలా తే" అంటూ పెద్ద బేసిన్‌లో రాశెడు పిండి పోసి, దాని ముఖాన డబ్బాలో డాల్డా అంత దిమ్మరించి మర్దించసాగారు. పిండి చూడగానే దడ పట్టుకుంది నాకు. 'మొగుడు కొట్టినందుకు కాదు, తోడి కోడలు దెప్పిందని ఏడ్చిందట' వెనకటికి నాలాటిదే! మావారు ఇంటికి వచ్చేసరికి ఇటువంటి ప్రయోగాలు కనిపిస్తే కోపం నసాళాని కంటి చిర్రు బుర్రుమని శివాలెత్తినట్లు చిందు లేస్తారు. 'తప్పదురా భగవంతుడా! ఈ రోజు తల్లీ, కొడుకుల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోవడం' అని నెత్తిన చేతులు పెట్టుకుని బితుకుబితుకుమంటూ అత్తగారి పనిని తిలకించసాగాను.

నావైపు చూడకుండా సీరియస్‌గా మురిపీ నలపడంలో మునిగిపోయారు. చేతిలో తీసిన ముద్ద నలిగి నలిగి రంగు మారి నల్లగా అయిపోయింది కానీ, అరగంటైనా ఒక్క మురిపీ కూడా కాలేదు. ఆఖరికి ఆవిడకే విసుగెత్తి "పద్దాలూ! మరచెంబు తేవే గవ్వలు నలిపి, పాకంలో పారేస్తాను. వెధ వ్వేళ్ళు పట్టు తప్పి మాట



వినడంలేదు."

మరచెంబు అటక మీద చెక్కపెట్టెలో ఉంది. నా పెళ్ళికి వాడి ఉంటారు బహుశా? అనుకుంటాను. ఆ తర్వాత దాని అవసరం ఈ రోజు వరకూ కలగలేదు. అది ఏ రూపంలో ఉందో అటక మీద నుంచి దించినా దానికి రూపం తేవాలంటే తప్పకుండా ఒకరోజు పడుతుంది. 'ఆపద్బాంధవా నీవే దిక్కు!' మనసులోనే ప్రార్థించాను.

గాలి దుమారం మావారి రూపంలో ఆ రోజు రోజూకంటే గంట ముందే వచ్చింది. వస్తూనే - "ఏమిటి? ఇల్లంతా పరుచుకుని కూర్చున్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఇద్దరికీ బుద్ధి లేదు. తిన్నదరక్క అక్కరలేని 'పిన్స్' పనులు పెడతారు."

వినుగ్గా పురాణం విప్పడంతో, భూగోళంలా పిండి ముద్ద భయపెడుతుంటే - "చదవేస్తే ఉన్న మతి పోయిందట! అలాగే నా బుర్రకి ఏమీ తోచటంలేదే పద్దాలూ!" అంటూ ఆ వలాన అత్తగారు లేచి వెళ్ళిపోతుంటే, ఉసూరుమంటూ లేచి నిమ్మకల రూపంలో వత్తి, వేయించేసరికి అర్ధరాత్రి అవడమే కాదు, నెలకి సరిపడా తెచ్చిన నూనె, రేషన్‌లో తెచ్చిన పంచదారా అంతా ఖాళీ!

మాకు వీక్లీలు, మంత్లీలు కొనడం అలవాటు. మా అత్తగారి అక్షరజ్ఞానం ఉందని చెప్పాను కదా! పుస్తకాలు రాగానే ముందు అందులోని వంట శీర్షికలు చదువుతారు. నాన్‌వెజ్ వంటలైతే పత్రికలవారికి సహస్రనామాలు చదివి, వెజిటేరియన్ వంటలైతే స్పందించి చేయాలని తాపత్రయం. అందులో పిండి వంటలైతే మరీను. అలాగే ఒకసారి మావారు ఊళ్ళో లేని సమయం చూసి "పద్దాలూ! ఈ రోజు మనోరంజితాలు చేద్దామే!" అంటూ గబగబా వస్తువుల లిస్టు చెప్పి, "తీసి బయట పెట్టు" అంటూ హుకుం జారీ చేశారు.

వద్దంటే పెద్దావిడ బాధపడుతుంది. సరేనంటే నా ఒళ్ళు హూనమవుతుంది. అసలేఅత్తగారిది పెద్ద చెయ్యి. ప్రతిదీ భారీగానే ఉండాలి. భయపడుతూనే మెల్లిగా - "అత్తయ్యా! పుస్తకం మనింట్లో లేదు. కొసింటి కాంతమ్మగారు పట్టుకెళ్ళారు. ఆవిడ ఇవ్వగానే చేద్దాం" అన్నాను.

"వా డొస్తే నిన్నూ నన్నూ తిడతాడే అమ్మా! అబ్బే! పుస్తకం ఎందుకూ? అంతా కంఠస్థం వచ్చేసింది నిన్నల్లా చదివానుగా!" అంటుంటే నిస్సహాయంగా చూసి, ఒక్కొక్క వస్తువే చెబుతుంటే బయటపెడుతూ - "అత్తయ్యా ఈ రోజుకి కొద్దిగా చేద్దాం. బాగా వస్తే మళ్ళీ చేద్దాం" అన్నాను.

నేను తీస్తున్న సామాన్లు వారగా పెడుతూ - "బాగానే ఉంది నువ్వు చెప్పేది. కానీ, రుచికైనా అందుతాయా? పిల్ల సన్నాసులు మళ్ళీ మళ్ళీ కావాలంటే?"

"పోనీ మీ ఇష్టప్రకారమే చేయండి. ఏదో మీరు కొద్దిగా చేసి చూపిస్తే, వెంటనే మీరు దగ్గరుండగా మళ్ళీ నేను చేద్దామనుకున్నాను. ఎల్లకాలం మీరే చేస్తే నాకు వచ్చే దెలా? పోనీలెండి ఏం చేస్తాం?"

నా దీనవదనం చూసి జాలిపడి - "అయ్యో! పిచ్చిపిల్లా! అలాగని చెప్ప వేం?" అంటూ అన్నీ కొద్ది కొద్దిగా తీసి చేయడం మొదలుపెట్టారు.

"పద్దాలూ! ఈ పప్పు, బెల్లం కలిపి రుబ్బవే! పొత్రం కదలడం లేదు." తంటాలుపడి తన శక్యం కాక నన్ను పిలిచారు. అయినా పొడి పప్పు, బెల్లం ఏం రుబ్బబడతాయి? "సరే" నంటూ రుబ్బురోలు దగ్గర చతికిలబడి "అత్తయ్యా పప్పు నానబెట్టా లేమో!" అన్నాను.

"నీ మొహం! నే చదివాగా! నానబెట్టడమా! నా బొంద!" పొత్రాన్ని కదపలేక ఎర్రబడ్డ చేతులకి కొబ్బరి నూనె రాస్తూ చెప్పారు.

బెల్లం రాయిలా ఉంది. పప్పు గట్టిగా ఉంది. రోలు అరిగి మట్టి వస్తోంది గానీ, నలగడం మాట దేవుడెరుగు పొత్రం కదలదే! నా వల్ల కావటంలేదు. బలవంతానా రెండు చేతులూ పట్టి తిప్పితే వగర్పు వస్తోంది. నా అవస్థ చూడలేక, చెంబుడు నీళ్ళు తెచ్చి దాని ముఖాన పోశారు అత్తయ్య. అంతే! బరబరా చప్పుడు చేసుకుంటూ గిరగిరా తిరగడం మొదలుపెట్టింది పొత్రం. బొళక్, బొళక్ మంటూ బురదలా తయారైంది పిండి. అంతా గిన్నెలోకి తీసి అత్తగారి ముందు పెట్టాను. "పద్దాలూ! దీని అవతారం చూస్తే నూనెలో వేగేలా లేదు. పోనీలే పెనం మీద దిబ్బట్లు కాల్చేస్తాను. రుచి బాగుంటే నూనెలో వేపుకుందాం" అన్నారు.

"అలాగే కానివ్వండి" అన్నాను.

వెంటనే పెనం కాలేసి పులుసు గరిటెడు నూనె పోసి, రెండు గరిటెల పిండి బుడుంగు, బుడుంగు మని పోశారు. అ దేం పిండోగానీ పెనం మీద వద్ద దగ్గర నుంచీ రకరకాల శబ్దాలు చేయడం మొదలుపెట్టింది. "దీని మొహం మండా! నోరుమూసుకుని చచ్చినట్లు కాలదు కాబోలు" అని తిడుతుంటే దగ్గరగా వెళ్ళి తొంగి చూశా. పైన పచ్చిగా ఉంది, కింద మాడుతోంది. వెంటనే తిరగేశారు.

"మనోరంజితం తిరగబడిందే!" అన్నాను సంబరంగా

"ఏం దొబ్బిడాయ్! రాశెడు నూనె తాగిందిగా తిరగబడక చస్తుందా?" నడ్డి మీద చేతులు వేసుకుని, సాధించాను అన్నట్లు గర్వంగా నా వైపు ఓ చూపు విసిరి దడదడ మని నాలుగు మనోరంజితాలు కాల్చిపెట్టారు. బెల్లం కదా, అదో రకం మాడు వాసన వంటింటిని ఆక్రమించుకుంది.

కొడుకు రుచి చూడలేదన్న దిగులు మనసులో పీకుతుంటే - "పద్దాలూ! వాడు రాగానే మళ్ళీ చేద్దామే" అన్నారు.


పరధ్యానంగా "ఎవరూ" అన్నా న్నేను.

"సీనాయ్ రాగానే చేద్దాం! ఇంత బాగా వస్తా యనుకోలేదు. వాడు చూస్తే తిడతా డన్న దిగులే కానీ, బాగుంటే వాడు మాత్రం తినడుటే వెర్రి నాగన్నా!"

"సరేలెండి! తప్పకుండా చేద్దాం. పిల్లలు వస్తే ఎంగిళ్ళు, మంగలాలు చేసేస్తారు. మీ రో ముక్క రుచి చూడండి."

"అయ్యో! ఉండనీవే పిల్ల సన్నాసులకి" అంటూనే చిన్న ముక్క తీసుకుని, "ఇది చాలు నాకు. మిగిలింది నువ్వూ, పిల్లలు తినండి" అంటూ నోట్లో వేసుకుని ముఖంలో నవరసాలు పలికించి "పత్రికల వాళ్ళని కాల్చిపారేయాలి. వెధవ వంటలూ వీళ్ళూనూ" అని తిట్టుకుంటూ నోరు శుభ్రం చేసుకోడానికి పెరట్లోకి వెళ్ళారు.

ఇంతలో రాక్షసుడు నరవాసన నరవాసన అని అరిచినట్లు, సంతానం "మాడు వాసన మాడు వాసన" అంటూ వస్తూనే వంటింట్లోకి అడుగుపెట్టి, మసిరంగులోని మనోరంజితాలని, ఈగలు ముసిరి పాకం కారుతున్న రుబ్బు రోలును చూసి - "నాన్నగారు ఊళ్ళో లేరని భండాల పనులు చేస్తున్నారా? నాన్నగా రుంటే ఈపాటికి కథాకళి చేసేవారు. మీ రెండుకమ్మా మీ



ప్రయోగాలలో మమ్మల్ని హింస పెడతారూ? దానివల్ల మీ కేం లాభం?'' ఇలా తమ అమూల్యమైన అభిప్రాయాలని వెల్లడించి, ఆఖరికి చిన్న ముక్కలు తీసుకుని ముక్కు బాధ భరించలేక ముక్కు మూసుకుని నోట్లో వేసుకుంటే, వాంతి వచ్చినంత పనై 'తమ వల్ల కాదని' ఊరకుక్కకి పెడితే, అది వెంటనే ముఖం చిట్లించి ముట్టకుండా పారిపోతే - ''మా కంటే కుక్క నయం! అరగంట తంటాలు పడి తినలేక, దానికి పెడితే అరక్షణంలో మూతివిరిచి పారిపోయింది'' అంటూ ఈ విషయాన్ని వాళ్ళ నాన్న ఊరి నుండి రాగానే సాగదీసి సాగదీసి పిల్లలు చెబుతుంటే, పిల్లలతోపాటు ఆయనా పగలబడి నవ్వారు.

కొడవలికి సిగ్గు లేదు, కొయ్యగూరకీ సిగ్గు లేదని - ఈ విషయం పాతబడకుండానే ఒక రోజు స్వర్ణ స్కూలు నుంచి వస్తూనే - ''బామ్మా! మా స్నేహితురాలు పూతరేకు పెట్టింది. వాళ్ళ బామ్మ చేసి ఊరినుంచి పంపారుట. ఎంత బాగున్నాయో!'' అంటూ మురిసిపోతూ చెప్పగానే.

''అయ్యో! పిచ్చి మొద్దూ! దాని కేం భాగ్యం. మనవూ చేసుకుందాం పూతరేకులు. మా అత్త పెద్ద బానకుండ బోర్లించి పేపర్లకంటే పెద్ద సైజు రేకులు ఎడంచేత్తో తీసిపారేస్తే, నేను పంచదార వేసి అందంగా చుట్టేదాన్ని. వెధవ పట్టణాల్లో అన్నీ కరువే. తిండి అంటే పల్లెల్లోనే. కమ్మని పిండివంటలకే మొహం వాచిపోయాం.''

చరిత్ర పునరావృత మవుతుంటే ''బామ్మా! మొదటి అక్షరం చెప్పి వదిలేయి. నేను పూర్తి చేస్తానని చెప్పానా! ఇప్పటికి లక్షా తొంభైసార్లు చెప్పావు. ఇక మీదట మేం చెబుతాం, నువ్వు విను. పెద్దదానివైపోయావు నీ ఎనర్జీ వేస్టు చేసుకోకు.''

ఎప్పుడు వచ్చాడో మధ్యలో అందుకున్న చిన్న మనవడి మాటలకి మురిసి మూర్ఛపోయినంత పనిచేసి - ''వేలెడంత లేని వెధవలు ఎంతెంత మాటలు నేర్చారో!'' అని ముద్దుగా విసుక్కుని - ''ఒరే శివా! బజారు వెళదాం పదరా!'' అన్నారు.

''ఎందుకు బామ్మా!''

''పూతరేకులకి కుండ తేవాలిరా!''

కుండ కోసం బజారు కెళ్ళడం వాడి కిష్టం లేక - ''నాకు బోలెడు వర్క్ ఉంది బామ్మా! నువ్వూ, స్వర్ణా వెళ్ళండి'' అని ఆటలకి తుర్రుమన్నాడు.

బామ్మా, మనవరాలు రిక్షాకి పది రూపాయలు తగలేసి, బజారంతా వెతికి ఇత్తడి చెంబు సైజులో అయిదు రూపాయ లిచ్చి కుండ కొని, పెరిగిపోతున్న ధరలని, పొగరుగా జవాబిచ్చిన కొట్టువాడిని తిట్టుకుంటూ ఇల్లు చేరారు.

కుండ సైజు చూసిన ఆనందంలో ఉబ్బి తబ్బిబ్బై ''అత్తయ్యా! ఈ కుండ పూతరేకులకి పనికివస్తుందా?'' నా మాటలు పూర్తి కాకుండానే - ''బియ్యం రుబ్బి నా కియ్యి చాలు. ఏదన్నా తెస్తే వంద ప్రశ్నలూ, వెయ్యి ఆరాలూ'' అని గొణుక్కుని, అయినా ''ఏమిటే అడిగావూ?'' అని మరోమారు అడిగి తెలుసుకుని ''భేషుగ్గా వస్తాయి. ముందు పని కానీ!''

ఆవిడ మాటలు విని హడలిపోయి ''అత్తయ్యా! ఇప్పు డొద్దు. మీ అబ్బాయి వచ్చే వేళయింది. రేపు చేసుకుందాం'' అన్నాను.

పిల్లలు, శ్రీవారూ ఇల్లు దాటగానే గబగబా బియ్యం రుబ్బి అందించాను. గ్రైండరు ఉన్నా అందులో పిండి బాగుండదని అత్తగారికి అనుమానం. అందుకనే తాతలనాటి నుంచీ వస్తున్న రుబ్బు రోలుని మాతోపాటు తిప్పుకుంటున్నాం.

మెత్తని గ్లాస్కో పంచె గుడ్డ తీసి అందించాను.

ఇక చూడండి! మా అత్తగారు రంగంలోకి దిగారు.

కుండని బోర్లించి అర్ధణా మందాన్ని నూనె పులిమి గానుపొయ్యి మీద బోర్లించి వేడెక్కగానే గుడ్డ పిండిలో ముంచి రాయడం మొదలుపెట్టారు. నే నేదో దేశం వదిలి వెళ్ళినట్లు - ''పద్దాలూ! నెయ్యీ, పంచదారా సిద్ధం చేసుకో'' అంటూ కేకలు.

దగ్గర కెళ్ళి చూద్దును కదా! అబ్బే! పూతరేకులు రాందే! చలికాలంలో ఒళ్ళు పెళ్లినట్లు, పొరలు రాలినట్లు, గుండ గుండగా రాలడం మొదలుపెట్టింది. అరగంటసేపు ఆవిడ రాస్తూనే ఉన్నారు. నేను చూస్తూనే ఉన్నాను.

అబ్బే! ఒక్కటంటే ఒక్కటీ రేకుపళంగా రాలేదు. విసుగు వచ్చి - ''పద్దాలూ! దాని ముఖాన ఇంత మినప్పప్పు రుబ్బి తగలెయ్యి! మ రిక గాస్ దండగే కానీ, పని కాదు. రాత్రికి దోశలన్నా పోసుకోవచ్చు. లేచిన వేళ బాగాలేదు'' అని గొణుక్కుంటూ అంతసేపు నిలబడ్డందుకు పిక్కలు పీకినట్లున్నాయి. కాళ్ళు జాపుకుని గోడకి జార్లబడి, విచారవదనంతో దీర్ఘంగా ఆలోచిస్తూ ముందు గదిలో కూర్చున్నారు.

గానుపొయ్యి ముఖం చూసిన నాకు ఏడు పొక్కటే తక్కువ. బియ్యప్పిండి మరకలు, నూనె జిడ్డు, మాడిపోయిన పిండి ముక్కలు.

ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది పిండివంటలు చేయడం కాశీలో ఎందుకు వదిలేయాలో.

కాస్సేపు వాళ్ళ మాటలు విందాం.

''బామ్మా! కాశీలో ఏ మేం చూస్తావూ?'' అడిగాడు పవన్.

''వెళ్ళే దెందుకు? విశ్వేశ్వర దర్శనానికి గదర్రా! గంగాస్నానం, కాలభైరవ దర్శనం.''

''బామ్మా! నువ్వు కాలభైరవుణ్ణి చూస్తావా? ఇంట్లోకి కుక్కపిల్లని రానివ్వవు నిన్ను గుళ్ళోకి రానివ్వరు. నువ్వు కుక్కపిల్లని తరిమి తరిమి కొడతావని తెలిసిపోతుంది.'' శివ బామ్మని భయపెట్టే ధోరణిలో అన్నాడు.

''తప్పు తప్పు. అలాంటి అప్రాచ్యపు మాటలాడకు. గట్టిగా లెంపలేసుకో. కాలభైరవునికి, కుక్క పిల్లకి పొంత నేమిటి?'' అయిదేసి నిమిషాల కొకసారి పెరట్లోకి వెళ్ళి పెట్టె ముట్టుకుని రాగానే పాతగుడ్డ ఎవరో ఒకరు అందిస్తే చేయి తుడుచుకుంటూ - ''ఇంకా ఆరలేదురా పన్నిగా! రంగు మంచిది కాదేమో!'' అంటూ తన సందేహం వెలిబుచ్చారు.

''చిత్తం చెప్పుల మీదా, భక్తి శివుని మీద బామ్మకి!''

ఇ ల్లెగిరిపోయేలా నవ్వులు.

ఈలోగా చిటపట లాడుతూ ఇంట్లో అడుగుపెట్టారు మా వారు.

ఆఫీసులో ఎవరితోనో యుద్ధం చేసి వచ్చిన వాలకం చూసి అందరూ గప్‌చిప్ అయిపోయారు.

ఏం పనిపడిందో తిన్నగా పెరట్లోకి వెళ్ళి, దేనికోసమో వెతుకుతూ పెట్టెమీద చెయ్యి వేశారు. రంగు అంటడంతో రంకెలు వేయసాగారు.

మెల్లిగా బామ్మ చెవిదగ్గర జేరి - ''బామ్మా! నువ్వన్నట్లు అసలే కోతి, ఆ పైన కల్లు తాగింది, దాంతో నిప్పులు తొక్కింది.'' పెరటివైపు చూపుతూ గునగునగా అన్నాడు శివ.

''భడవా! ను వ్వెసవచ్చునా అలా!'' ముద్దుగా కోప్పడుతూ అంది.

''బామ్మా! నువ్వన్నట్లు అన్నా గదే! నా మాట వినిపించుకోవూ?''

ఏ సందులో ఇరికించిందో గానీ, బామ్మ ప్రయాణానికి పెట్టె సిద్ధం చేస్తోందని స్వర్ణ గబగబా గదిలోకి వచ్చి ''రాశెడు సామాన్లు తయారుచేస్తే ప్రయాణం కాన్సిల్ చేస్తా'' అన్నారు మా వారు.

''అదేవిటిరా సీనాయ్! దూరాభార ప్రయాణం. సామాన్లు లేకపోతే ఎలా?'' అమాయకంగా అడుగుతున్న అత్తగారిని చూసి - ''అయితే ఏమిటంటావు? ట్రంకుపెట్టె, ఇత్తడి బిందె పట్టుకుని బయలుదేరతావా?''

''కోపడకురా అబ్బీ! మా క్కావలసినవి తెచ్చుకోనీ!''

''అలాగే అలాగే. ఈ ఇంటికి చక్రాలు వేయిస్తాను. నువ్వూ, నీ మనవలూ ఈడ్చుకురండి!''

మరి చాలింటి. మావారు సీరియస్‌గా ఉన్నారు. అసలే ప్రయాణం హడావుడి. తిరిగి వచ్చాక తాపీగా రాస్తాను కాశీ విశేషాలు! ★

## బ్రహ్మాండమైన పుట్టగొడుగులు

పుట్టగొడుగులు కంటికి కనిపించనంతటి సూక్ష్మమైన స్థాయి నుంచి గజం వెడల్పు గొడుగులు గలవి కూడా ఉన్నాయి. కిలోలకొద్దీ బరువుతూగే బ్రహ్మాండమైన పుట్టగొడుగులు లేకపోలేదు. రష్యాలోని కీవ్‌షెల్ పట్టణానికి చెందిన అనటోలి గోర్బచెవ్, రోడ్డు దగ్గరగా ఉన్న అటవీ ప్రాంతంలో రెండు తెల్లని గుండ్రని నిర్మాణాలను చూశాడు. అవి ఏమై ఉంటాయా అని దగ్గరికి వెళ్ళి చూస్తే, ఒక్కొక్కటి ఏడు కిలోల బరువు తూగే బ్రహ్మాండమైన పఫ్‌బాల్ రకం పుట్టగొడుగులని తేలింది. అయితే ఇంత పెద్ద పుట్టగొడుగులు ఇదివరకు కనిపించకపోలేదు. జంటగా కనిపించడం మాత్రం ఇదే మొదటిసారి.

-సమ్మెట గోవర్ధన్